

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

జిన్నూరు,
4-5-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆది శంకరాచార్యులు కాలిడిలో జన్మించారు. శంకరాచార్యులు తల్లి పేరు ఆర్యాంబ, తండ్రి పేరు శివగురువు. ఆర్యాంబ, శివగురువులకు చాలా కాలము సంతానము కలుగలేదు. వారు శివుని ప్రార్థిస్తే శివుని అంశవలన ఆచార్యులవారు జన్మించారు. ఆచార్యులవారి 3వ సంవత్సరములోనే తండ్రి స్వర్గస్థులైనారు. ఆచార్యులవారు, బుద్ధుడు, రమణమహర్షి కూడా కొంతకాలము బిక్ష చేసుకొన్నారు. బిక్ష చేసుకొన్నప్పుడు అందరూ తిడతారు కదా మనలో ఏదైనా పొగరుబోతుతనం ఉంటే తగ్గిపోతుంది. బుద్ధుడు తన తండ్రి ఇంటికే బిక్షకు వెళ్ళాడు. మహారాజుగా ఉండవలసిన వాడు బిక్ష చేసుకొంటున్నాడు అని తండ్రి బాధ పడతాడు. తండ్రికి ఇంకా దేహ భావన పోలేదు అని బుద్ధుడు బాధ పడతాడు. ఇద్దరూ బాధపడ్డారు.

ఆచార్యులవారు ఒకరి ఇంటికి బిక్షకు వెళ్ళారు. ఆచార్యుల వారిని చూసి ఆమెకు ఏదో ఒకటి పెట్టాలని అనిపించిందట. బాగా దరిద్రులు. ఇంటిలో ఏమీలేవు. ఏదోఒకటి పెట్టాలని ఇంటిలో అటూఇటూ తిరుగుతోందట. వారికి, మనకు ఒక తేడా ఉంది. వారు భౌతికంగా దరిద్రులు అయ్యి ఉండవచ్చును. కాని ఆలోచనా దారిద్ర్యము వారికి లేదు. అందువలన పవిత్రులు అవుతారు. మనకు భౌతికంగా డబ్బు ఉండవచ్చును కాని ఆలోచనా దారిద్ర్యము ఉన్నందువలన మనం ఎదగలేకపోవుచున్నాము. చివరికి ఆమెకు ఒక ఉసరికాయ కనబడితే అదితెచ్చి ఆచార్యువారికి ఇచ్చిందట. వారి దారిద్ర్యానికి బాధపడి ఆచార్యులవారు లక్ష్మీదేవిని ప్రార్థించారట. అప్పుడు లక్ష్మీదేవి వచ్చి వారు పూర్వజన్మలో ఎవరికీ ఏమీ పెట్టినవారు కాదు, వీరి గురించి అడుగుతున్నావు అని చెప్పిందట. పూర్వజన్మ గురించి ఎందుకు ఇప్పుడు నాకు ఉసిరికాయ పెట్టింది కదా అని ఆచార్యులవారు చెప్పారట. అప్పుడు లక్ష్మీదేవి బంగారు ఉసిరికాయలు కురిపించిందట.

ఆచార్యులవారు విద్యాస్వరూపుడు. నరనరానికి విద్య. నరనరానికి మేధావి. ఇంత చదువు చదివిన ఆచార్యులవారు శ్రవణం చేయాలంటే బ్రహ్మంగురించి శ్రవణం చేయండి, అంతకంటే శ్రవణం చేయటానికి ఈలోకంలో ఏమి ఉంది అని చెప్పారు. కాలిడి ప్రక్కన పూర్ణానది ఉండేది. ఆచార్యులవారి తల్లి అక్కడకు స్నానం చేయటంకోసం వెళ్ళేది. స్నానం కోసం అంతదూరం వెళ్ళటానికి తల్లిపడే కష్టాలు చూసి నదిని ఇంటిప్రక్కగా వెళ్ళమని నదీదేవతను ఆచార్యులవారు ప్రార్థిస్తారు. అప్పటినుండి నది ఇంటి ప్రక్కగా ప్రవహించేది. ఇది అంతా అసత్యములాగ మనకు అనిపిస్తుంది. మన దగ్గర పొరపాటు ఏమిటంటే మన బుద్ధికి అందని విషయాలు, మన శక్తికి మించిన విషయాలు అబద్ధం అనుకొంటాము. ఈ దోషం అందరిలోనూ ఉంది. ఇది అంతా కల్పితము అనుకొంటారు. ఇది చారిత్రక సత్యము. సన్యాసము తీసుకోవటానికి తల్లి అనుమతి పొందాలి. ఒక్కడే కొడుకు కదా సన్యాసం తీసుకోవటానికి తల్లి అనుమతించదు. ఆచార్యులవారు స్నానం

చేస్తున్నారు. ఆచార్యులవారు దొంగ మొసలిని సృష్టించి ఆయన కాలు పట్టుకొని లాగుకొని వెళ్ళేటట్లు చేసారు. చనిపోతున్నాను అని ఆచార్యులవారు కేకలు పెట్టారు. తల్లి బాధ పడుతోంది. అప్పుడు ఆచార్యులవారు తల్లితో నేను సన్యాసం తీసుకోవటానికి అనుమతిస్తే మొసలి నన్ను వదలి పెట్టే అవకాశం ఉంది అని చెప్పారు. సన్యాసం తీసుకొంటే ఎక్కడో ఒకచోట ఉంటాడు. చనిపోయే కొడుకు కంటే బ్రతికున్న కొడుకు మేలు కదా అని ఆచార్యులవారి తల్లి అనుకొని సన్యాసం తీసుకోవటానికి అనుమతి ఇచ్చింది. వారసత్వపు రీత్యా వచ్చే ధనము నాకు అక్కరలేదు. దానిని మీరు అనుభవిస్తూ తల్లికి ఏమీ కావాలో చూడండి అని చుట్టాలతో చెప్పారు. అవసాన దశలో ఒకసారి స్మరణ చేసుకో నేను వస్తాను అని తల్లికి చెప్పి వెళ్ళిపోయాడు. ఇంటికి కూడా వెళ్ళలేదు. ఆ వైరాగ్యము చూడండి.

ఒక సంవత్సరము తిరిగాడు. దేశ పరిస్థితులు చూసాడు. గోవింద భగవత్పాదుల దగ్గర కొంతకాలము శిక్షణ పొందాడు. గోవింద భగవత్పాదులు ఆచార్యులవారిని కాశీ వెళ్లమని చెప్పారు. గురువు సలహాపై ఆచార్యులవారు కాశీ వెళ్ళారు. రోజూ గంగానదిలో స్నానం చేయటం, విశ్వేశ్వరుని ఆరాధించటం, పండితులను ఆహ్వానించి ఉపనిషత్‌లు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు గురించి చెప్పటం ప్రారంభించారు.

తల్లి శవమునకు నిప్పుపెట్టమని తల్లి కోరినందువలన తల్లి అసాన సమయములో ఆచార్యులవారు అక్కడకు వచ్చారు. తల్లికి ఆత్మ గురించి చెపుతారు. అప్పుడు తల్లి ఈ బోధను అర్థం చేసుకొనే శక్తి నాకు లేదు ఏదైనా దేవతారూపమును చూపమని అడుగుతుంది. అప్పుడు ఆచార్యులవారు విష్ణువును ప్రార్థిస్తే విష్ణువు వచ్చి తల్లికి దర్శనం ఇస్తాడు. తల్లి మనస్సును ఆ రూపము మీద పెట్టి ప్రాణమును విడుస్తుంది. ప్రార్థిస్తే దేవతలు కూడా అక్కడకు వచ్చి నిలబడతారు. ఏమి పని కావాలి అని అడుగుతారు జ్ఞానం యొక్క వైభవం అటువంటిది.

నీవు సన్యాసివి తల్లికి నిప్పుపెట్టకూడదు అని అక్కడ బ్రాహ్మణులు పేచీ పెడతారు. కాని తల్లికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం కోసం ఆచార్యులవారు నిప్పును సృష్టించి తల్లికి దహన సంస్కారము చేస్తారు.

ఆచార్యులవారు అనేక గ్రంథాలు వ్రాసారు. వ్రాయటమే కాకుండా దేశం అంతా తిరిగి ప్రచారము చేసారు. ఉపనిషత్‌లు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు వీటికి బాష్యాలు వ్రాసి, అర్థం చెప్పి వాటిని ప్రచారము చేసారు. వీటికి వాఖ్యానాలు వ్రాసి, దేశమంతటా కాలినడకను తిరిగి ప్రచారము చేసి జ్ఞానమతమును స్థాపించారు. 32 సంవత్సరముల జీవితకాలంలో ఇంతపని చేసాడు. ఇక్కడే ఆశ్చర్యము అనిపిస్తుంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చేయలేని పనిని ఆచార్యులవారు చేసారు అని నాకు అనిపిస్తుంది. ఈ మాట చెపుతున్నందుకు నన్ను క్షమించండి. వారు అవతార పురుషులే.

చివరిలో కేదారిలో దత్తాత్రేయ గుహదగ్గర కూర్చొని వచ్చినవారికి చెపుతూ ఉండేవారు. ఆఖరి రోజున కూడా ఆయన బోధను విడిచిపెట్టలేదు. ఇంకా సందేహాలు ఏమైనాఉంటే అడగండి అని చెప్పారు. అలా అంటూనే మీరు నాకూడా రాకండి అని చెపుతూ దత్తాత్రేయ గుహలోనికి వెళ్ళి అదృశ్యమైపోయారు. ఆచార్యులవారి దేహం శవం అవ్వలేదు. అదృశ్యమై పోయింది.

దేశ సమైక్యత కోసం, దేశంలో అందరూ చైతన్యవంతులు అవ్వటం కోసం ఆచార్యులవారు విశ్రాంతి లేకుండా, జీవితం పొడుగునా కృషి చేసారు. దేశం నాలుగు మూలలలో నాలుగు మఠాలు పెట్టారు.

ప్రాంతీయబుద్దిలేదు. ప్రతీ చిన్న విషయమునకు Local, Non local అని చూస్తూ ఉంటే దేశ సమైక్యత రాదు. ఇది సంకుచిత మనస్తత్వము. జ్ఞాన మార్గమును బోధిస్తూ ఆయన దేశం అంతా తిరిగారు.

రోగం వస్తే మందులు ఎలా వేసుకొంటారో ఆకలి అనే రోగమునకు అన్నం అనే మందును అలా వేయండి అని ఆచార్యులవారు చెప్పారు.

శరీరధారియై ఈ భూమి మీదకు వచ్చినవాడు ఎవడైనా సరే యజ్ఞము, దానము, తపస్సు ఈ మూడింటిని విడిచిపెట్టవద్దు అని కృష్ణుడు చెప్పాడు. ఇవి మూడూ వేరువేరుగా కనబడతాయిగాని యజ్ఞంలో దానం ఉంది, యజ్ఞంలో తపస్సు ఉంది. ఇతరులకు మనం చేయగలిగిన సహకారం చేయటమే యజ్ఞము. ఏమీ ఆశించకుండా ఇతరులకు సహకారము చేయటమే యజ్ఞము. యజ్ఞములోనే దానం ఉంది. తపస్సు ఉంది. నిష్కామంగా పనిచేస్తూ ఉంటే, స్వార్థరహితముగా పని చేస్తూ ఉంటే వస్తువు దానంతట అదే మనలను వరిస్తుంది. మనం దాని దగ్గరకు వెళ్ళ నవసరము లేదు. కంగారు పడకూడదు. మన చేతిలోని పనిని చక్కగా చేయాలి. వస్తువు కోసం వేగిర పడకూడదు. నెమ్మదిగా మీరు చేయవలసిన పనిని చేయండి. జాగ్రత్తగా సరియైన మార్గములో వెళితే వస్తువును పొందవచ్చును.

మీరు ఏదైతే నేను నేను అంటున్నారో అది బ్రహ్మమైతే బోధ అక్కరలేదు. అది బ్రహ్మము కాదు. ఉన్నది ఒకటే వస్తువు. అది చైతన్యము. నీవు కృష్ణుడు అనుకొన్నా, రాముడు అనుకొన్నా, అల్లా అనుకొన్నా ఉన్నది చైతన్యము ఒక్కటే. దానిని రకరకాల పేర్లతో అనుకోవచ్చును. నేను అనే బుద్ధి ప్రతీవాడికి ఉంది. అది నీలోపల నుండే ఉదయిస్తోంది. నేను అనే బుద్ధి ఎక్కడనుండి ఉదయిస్తోందో అదే హృదయము. అక్కడే చైతన్యము ఉంది. నేనును హృదయంలోనికి తోలుకొని వెళ్ళగలిగితే అక్కడ అది నశిస్తుంది. నేనుకు అనేక గొడవలు వస్తూ ఉంటాయి. ఇవి బుడగలవంటివి, కెరటములవంటివి. ఈ బుడగలను, కెరటములను పట్టుకొని ఉంటే లోపలికి మునగలేవు. బుడగలతోటి, కెరటములతోటి కలిసి ఉంటే లోపలికి మునిగేదిలేదు, వస్తువు దొరికేదీ లేదు అంటున్నారు భగవాన్.

చాలామంది చిన్న చిన్న గొడవలను పట్టుకొని కాలక్షేపం చేస్తూ ఉంటారు. వీరికి విచారణ ఉండదు, సత్యాన్వేషణ ఉండదు. నీవు సత్యాన్వేషణ మొదలు పెట్టినపుడు ఆ అన్వేషణలోనే ఈ నేను నన్నగిల్లి చనిపోతుంది. సత్యాన్వేషణ చేసేది అబద్ధమైన నేనే. సత్యాన్వేషణలో సత్యం దగ్గరకు వెళ్ళేసరికి ఇది నశిస్తుంది. చిల్లర గొడవలలో ఉంటే సత్యన్వేషణ చేయలేరు. ఈశ్వరుని ప్రేమించటం వలన, సత్పురుషుల సహవాసం వలన మనస్సుకు బలం చేకూరుతుంది. మనస్సుకు బలం చేకూరినపుడు అక్కరలేని గొడవలను అది నిరోధించ గలుగుతుంది. మనస్సుకు బలం చేకూరినపుడు అక్కరలేని గొడవలతో తాదాత్మ్యం తగ్గిపోతుంది. అప్పుడు సహజంగా అది లోపలకు ఉపసంహరింపబడుతుంది.

మీకు తలంపులు వస్తున్నాయి. నేను ఉంటేనే తలంపులు వస్తున్నాయి. ఆ నేనును ప్రశ్నిస్తూ ఉండు. నీ నేనునే నీవు ఎవడు అని అడుగు. దానిని నీవు అడగటం లేదు ఎందుకంటే అదే నీవు అనుకొంటున్నావు. దానిని ప్రశ్నించు. ఆ నేనును ప్రశ్నించటం నేర్చుకో. అప్పుడు అది లోపలకు ఉపసంహరింపబడుతుంది. అప్పుడు దానికి వచ్చే తలంపులు ఆగిపోతాయి.

భగవంతునికి శరణాగతి పొందండి అని శాస్త్రములు చెపుతున్నాయి. భగవంతునికి శరణాగతి పొందే కొలది నేను పల్చబడుతూ ఉంటుంది. శరణాగతి వలననే దేహము నేను అనే తలంపు పల్చబడుతుంది. ఎవరో అడ్డువస్తున్నారు అనుకోవద్దు. దేహము నేను అనే తలంపు మనకు అడ్డువస్తోంది. ఇది తెలుసుకోవటానికి వెయ్యి జన్మలు పట్టవచ్చును. ఇది అర్థం చేసుకోండి. చిల్లర గొడవలలో ఏమి ఉంది వాటిని వదిలివేయండి. సృష్టిలో ప్రతీప్రాణికి దుఃఖము ఉంది. దుఃఖము ఎక్కడనుండి వస్తోంది. మమకారము నుండి దుఃఖము వస్తోంది. మమకారము తీసివేసి చూడండి మీకు ఎవరికైనా దుఃఖము ఉందేమో చెప్పండి అన్నారు ఆచార్యులవారు.

బాహ్యమైన భోగములు మనకు అమృతంలాగ కనిపిస్తాయి. అందముగా కనిపిస్తాయి. ఇవి ఎంత అందముగా కనబడతాయో పరిణామంలో అంత దుఃఖమును తీసుకొని వస్తాయి. అంత గొప్పగా కనబడే భోగములను త్యాగం చేసినప్పటికీ గురువు పాదాలమీద భక్తి లేకపోతే నీకు జ్ఞానం కలుగదు అన్నారు ఆచార్యులవారు. ఆ భోగములను విడిచిపెట్టే శక్తి నీకు ఉన్నప్పటికీ గురువు పాదాలమీద భక్తి లేకపోతే నీకు జ్ఞానం కలుగదు. తల్లితండ్రులు కేవలం నీకు శరీరమును ఇచ్చారు. కాని గురువు జ్ఞానమును ఇస్తాడు. దాని వలన మోక్షం వస్తుంది. అట్టి గురువు పాదాలమీద నీకు శ్రద్ధ లేకపోతే నీకు జ్ఞానం కలుగనే కలుగదు. ఇచ్చేవాడు గురువు. బ్రహ్మానుభవం పొందినవాడు గురువు. అట్టి గురువు యొక్క ఒక్క చూపు సరిపోతుంది. ఒక్క స్పర్శ సరిపోతుంది. ఇది నీ మొత్తము జీవితమును మార్చేస్తుంది.

నిద్రలో ఎలాగ ఉంటున్నావో జాగ్రదావస్థలో అలాగ ఉండటం నేర్చుకో. అప్పుడు అబద్ధమైన నేనుకు ఆహారం దొరకక సన్నగిల్లిపోతుంది. ఇది సన్నగిల్లిపోయింది అని కంగారు పడవద్దు. ఇది సన్నగిల్లిపోయి నిజమైన నేనుకు చోటుఇచ్చి అది చచ్చిపోతుంది. ఆ నిజమైన నేనే బ్రహ్మము. నీకు దేహము అనుభవంలో ఉంది. దేహము నేను అనుకొంటున్నావు. నీకు మనస్సు అనుభవంలో ఉంది మనస్సును నేను అనుకొంటున్నావు. నీలోపల బ్రహ్మం ఉంది. బ్రహ్మం నీకు అనుభవంలో లేదు కాబట్టి అది నేను కాదు అనుకొంటున్నావు. దేహము, మనస్సునీవు అనుకొన్నప్పుడు కూడా నీవు బ్రహ్మమే. అది అనుభవంలోనికి రావటం లేదు కాబట్టి లేదు అనుకొంటున్నావు. అది అనుభవైక వేద్యము. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీవు చేయవలసిన పని. దీనికి గురువు సహాయం అవసరము. ఆ వస్తువును తెలుసుకొనే ప్రయత్నంలోనే సాధనచేసేవాడు చనిపోతాడు. ఆ వస్తువు గురించి తెలిసాక నీవు సాధన చేద్దామని అనుకొన్నా సాధన చేసేవాడు అక్కడ ఉండడు. అప్పుడు మీసాధన అవసరము లేదు. మీకు బరువులు లేవు, బాధ్యతలు లేవు. బరువులు, బాధ్యతలు ఎవరికి అంటే అహంకారమునకు. బ్రహ్మానుభవం పొందినవాడి బరువు, బాధ్యతలు దేవుడు మీద వేసుకొంటాడు. అహంకారము ఉన్నవాడు తన బరువును తన మీదే వేసుకొంటాడు. మేము కష్టబడి పోతున్నాము, చాలా బాధ్యతలతో ఉన్నాము, బరువులతో ఉన్నాము, చాలా గొడవలలో ఉన్నాము అని అంటూ ఉంటారు. అహంకారము అనే గడపను దాటి చూడండి ఆ బరువులు, గొడవలు ఉన్నాయేమో చూడండి అనేవారు భగవాన్. అహంకారము అనే గడపను దాటి చూడండి. ఈ బరువులు, గొడవలు అన్నీ వాటి అంతట అవే రాలిపోతాయి. మీరు లాక్కొంటే పోవు. వాటి అంతట అవే ఊడిపోతాయి. చాలామంది మోక్షంను కోరుకోరు. కొత్త జన్మలను కోరుకొంటూ ఉంటారు. మీరు కొత్త చీర కొంటే ఎంతకాలము కొత్తగా ఉంటుంది. మొదటిసారి కట్టుకొన్నప్పుడు కొత్తగా ఉంటుంది. తరువాత పాతే.

మోక్షం విలువ మనకు తెలియక కొత్త జన్మలను కోరుకొంటున్నాము. కొత్త దేహము, కొత్త వాతావరణం కొంత కాలము సరదాగా ఉంటాయి. తరువాత పాతబడిపోతాయి. తరువాత రోజులు వెళ్ళటంలేదు అని చావుకోసం కనిపెట్టుకొని ఉంటారు. ఇది కూడా మాయ. భగవాన్ దగ్గర కూర్చుని ఒకడు ప్రాణాయామం చేస్తున్నాడు. అతను గాలిని లోపల నిలబెట్టి ఉంచలేక పోతున్నాడు. భగవాన్‌తో గాలిని లోపల నిలబెట్టి ఉంచలేకపోతున్నాను అని చెపితే మొత్తం గాలి అంతా బయటకువస్తే దరిద్రము వదులుతుంది అన్నారట. సూర్యుడు ప్రకాశిస్తూ ఉంటే కిరసనాయిలు దీపం ఏమిటి? ఇంటిలో కరెంటు ఉన్నా నరే నేను కిరసనాయిలు దీపం వెలిగించుకొంటాను అంటే ఆ మనుషులకు ఎవరు చెప్పగలరు. అతను కూర్చున్నది జ్ఞాన సూర్యుడు ఎదురుగా. ప్రాణాయామం చేసుకొంటాను అంటే ఏమిటి?

నచ్చిన మార్గములో ప్రయాణం చేయండి. విశ్వాసం సడలకుండా చూసుకోండి. సైతాను విశ్వాసమును చెదరగొడుతుంది. ఎందుచేతనంటే విశ్వాసం పెరిగితే సైతాను చనిపోతుంది. ప్రయాణించే మార్గమునుండి తప్పిపోవద్దు.

దేహము నేను అనదు. బ్రహ్మము నేను అనదు. మధ్యలో ఏదో ఒకటి నేను అని అంటోంది. అది అర్థమయితే మీకు జ్ఞానము వస్తుంది. ఇది సూటి మార్గము అంటున్నారు భగవాన్. Direct method ఉండగా indirect method ఎందుకు అనేవారు భగవాన్. దేహం గొడవ వద్దు. బ్రహ్మం గొడవవద్దు. ఏదైతే నేను, నేను అంటోందో దానిని పట్టుకోండి. దానిని విచారణ చేయండి. దానిని వెంటాడండి. అది కాలి బూడిద అవుతుంది. అది ఎప్పుడూ లేదన్న సంగతి అది నశించాక మీకు తెలుస్తుంది.

ఏ పని చేసినా శ్రద్ధగా చెయ్యి. అశ్రద్ధగా చెయ్యవద్దు. విసుగు లేకుండా చెయ్యి. చిన్న పని అయినా సరే శ్రద్ధగా చెయ్యి. విరామము లేకుండా చెయ్యాలి. బ్రేకులు పడకూడదు. గమ్యం చేరేవరకూ సాగాలి. నదీ ప్రవాహములాగ ఉండాలి. విశ్రాంతి లేకుండా చెయ్యాలి. ధ్యానం చేయటం వలన ఏ ఫలితము అయితే వస్తుందో నీవు చేసే పని దగ్గర హృదయం పెట్టి చేస్తే, శ్రద్ధగా చేస్తే ఆ పని వలన కూడా అదే ఫలితము వస్తుంది. తేలే మనస్సును హృదయంలోనికి ముంచటానికి అనేక ఉపాయములు ఉన్నాయి. అందులో సత్పురుషుల సహవాసము ఒకటి. సహజమైన గాలి వీస్తూ ఉంటే ఫానులతో పని ఏముంది. అలాగే సత్పురుషులు దొరుకుతూ ఉంటే ఈ ముక్కు మూసుకోవటాలు అవీ ఎందుకయ్యా అనేవారు రామకృష్ణ పరమహంస. ప్రాణాయామం అవీ ఫానుల లాంటివి. సత్పురుషులు సహవాసం సహజముగా వీచేగాలి వంటిది.

మనకు ఎంతసేపు theory గొడవేగాని practice గొడవ ఉండదు. విషయములను వినటం వరకేగాని వానిని ఆచరించటం గొడవ మనకు ఉండదు. కాని రామకృష్ణుడు ఎవరైనా మంచి చెపితే అది విన్న వెంటనే ప్రాక్టీసులోనికి వెళ్ళిపోయే వారట. అలా ప్రాక్టీసు చేసిచేసి చివరకు ఇవ్వటం మొదలుపెట్టారు. అప్పుడు పుచ్చుకొన్న వాళ్ళలో నేనూ ఒకడను అన్నారు నరేన్.

ఎక్కువ సాధనలు చేయనక్కరలేదు. కొద్దిగా చేసినప్పటికి మనస్సు శుద్ధ మవుతుంది. బయటకు అందరి శరీరములు ఒకలాగే కనిపిస్తాయి. కాని లోపల మనస్సు పరిశుద్ధమనస్సు, అపరిశుద్ధమనస్సు అని రెండు రకములు. నీవు పరిశుద్ధ మనస్సుడవైతే లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తుంది. నీవు అపరిశుద్ధమనస్సుడవైతే

నీవు ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని నదులలో మునిగినా వస్తువు నీకు వ్యక్తంకాదు. వాడు బాగా తీరాడు, వాడు బాగా ఎదిగాడు అంటూ ఉంటారు. అలాగ మనస్సు ఆత్మగా తీరినపుడు అంటే మనస్సు ఆత్మను చింతించగా, చింతించగా మనస్సు ఆత్మ అవుతుంది. వాసనల గురించి కంగారు పడనక్కరలేదు. వాటి అంతట అవే రాలి పోతాయి. నీవు ఆత్మగా తీరినపుడు వాసనలు ఎలా పోతాయి అనుకోనక్కరలేదు. అవే రాలిపోతాయి. భగవాన్ మనలను దేవాలయంలోనికి తీసుకొని పోవటం లేదు. జ్ఞానాలయం లోనికి తీసుకొని పోతున్నాడు.

భగవాన్‌తో పరిచయం ఎలా ఉండేది అంటే ఆయనతో మాట్లాడుతూ ఉంటే ఎన్నివేల జన్మల నుండో ఆయనతో సాన్నిహిత్యము ఉన్నట్లు అనిపించేదట. మొదటిసారి భగవాన్‌ను చూడటం అదే అనుకోండి అయినా ఎన్నో జన్మల నుండి పరిచయం ఉంది, అది ఇంకా సాగుతోంది అనిపించేదట.

మాకు ఆవాసనలు ఉన్నాయి, ఈ గొడవలు ఉన్నాయి అనే గొడవ ఎందుకు. నీవు బ్రహ్మంలో తీరు, చైతన్యంలో తీరు, జ్ఞానంలో ఎదుగు అప్పుడు వాసనలు కాలి బూడిద అవుతాయి. వాటికి బలం ఇచ్చేది నీవే. అవి పోవటం లేదు అని బాధపడేది నీవే. వాటివంక చూడకు. బ్రహ్మం వైపే దృష్టిని పెట్టుకో. ఆ జ్ఞానాగ్నిలో వాసనలు కాలి బూడిద అవుతాయి. వాటి గొడవ నీకు ఎందుకయ్యా. వాసనలు అవే ఊడిపోతాయి. అవి తాత్కాలికంగా ఉన్నా నిన్ను బాధించటం మాని వేస్తాయి. పూర్తిగా కాలి బూడిద అవ్వటానికి కొంత కాలం పట్టవచ్చును. మీరందరూ తీరండి. పుట్టినప్పుడు ఎలా ఉన్నారో అలా ఉండవద్దు. ఎదగండి. జ్ఞానంలో ఎదగండి. మీరు చిన్న ప్రయత్నం చేసినప్పటికి అది మీ అపరిశుద్ధ మనస్సును పరిశుద్ధ మనస్సుగా మారుస్తుంది. హృదయంలో ఒక సహజమైన వస్తువు ఉంది. హృదయంలో సహజమైన వస్తువు ఉన్నప్పటికీ నేను అసహజముగా ఎందుకు ఉంటున్నాను అని భగవాన్‌ను అడిగితే ఇవి అన్నీ నీ తలంపులే. నేను అసహజస్థితిలో ఉన్నాను అనేది కూడా ఒకతలంపే. వీటినుండి విడుదల పొందితేనేగాని సహజ స్థితి నీకు తెలియదు. ఏదైతే నీవు కాదో దాని నుండి విడుదల పొందితే సహజస్థితి నీకు తెలుస్తుంది. తలంపులతో కలసి ఉన్నందువలన నీవు అసహజ స్థితిలో ఉన్నాను అనుకొంటున్నావు. నీవు అసహజ స్థితిలో ఉన్నాను అనుకొన్నప్పుడు కూడా నీవు సహజస్థితిలోనే ఉన్నావు.

ప్రపంచమును ఇంద్రియాలతో చూస్తున్నాము. చూచేవాడు, చూడబడేది కల్పన. ఇది దేవుని వ్యాపారము. దేవుని కల్పనను ఎవడైతే దాటాడో వాడు దేవుడు అయిపోతాడు. ఈ వ్యాపారము ఎప్పుడూ ఉంటుంది. ఈ వ్యాపారం నుండి ఎవడైతే బయటపడ్డాడో వాడు జ్ఞాని అవుతాడు.

మీరు పెద్ద పెద్ద సాధనలు చేయలేక పోయినా నాకిష్టమైన పనులు చేయండి. నాదయకు పాత్రులవుతారు. నాదయకు పాత్రులయినపుడు మీరు అడగకుండానే నా స్వరూపమును మీకు ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు.

కొంత మంది మంచి పనులు చేస్తారు. అందరికీ తెలియాలి అనుకొంటారు. అది తేలిక స్వభావము. తేలిక స్వభావము ఉంటే గుర్తింపు కోరుకొంటారు. తేలిక స్వభావము లేకపోతే మనస్సు వెళ్ళి హృదయ గుహలో పడిపోతుంది. మీకు స్వస్థత చేకూరుతుంది.